సాక్షి శ్రీసత్యసాయి జిల్లా


సోమవారం । 24 । జూలై । 2023



తండ్రీకొడుకు బలవన్మరణం

శనగల వ్యాపారంలో భారీగా నష్టం రావడంతో బెళుగుప్పకు చెందిన తండ్రీకుమారుడు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు.

8లో



టమాట @ రూ.107

కక్కలపల్లి మండీలో ఆదివారం టమాట కిలో గరిష్ట ధర రూ. 107 పలికింది. కనిష్టం రూ.55, సరాసరి రూ. 87 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

32.4°/21.6°

జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. నైరుతి దిశగా గాలులు గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో నేడు 'స్పందన'



అరుణ్‌బాబు, జిల్లా కలెక్టర్

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'స్పందన' సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు. జిల్లాతో పాటు డివిజన్, మండల స్థాయిలోనూ 'స్పందన' ఉంటుందన్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వినతి పత్రాలపై ఆధార్, ఫోన్ నంబర్లు తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆదేశించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎస్పీ కార్యాలయంలోనూ..

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం 'స్పందన' నిర్వహించనున్నారు. ఈ మేరకు పోలీస్ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలైంది. ప్రజలు తమ సమస్యలపై ఎస్పీకి నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

11 మండలాల్లో వాన



పుట్టపర్తి పట్టణంలో కురుస్తున్న వర్షం

పుట్టపర్తి అర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలోని పలు మండలాల్లో రోజంతా వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ జల్లులు కురుస్తూనే ఉన్నాయి. వాతావరణం పూర్తిగా మారిపోయింది. గాలి వేగం తగ్గింది. తుపాను ప్రభావంతో జిల్లాలో 11 మండలాల్లో వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. పరిగి మండలంలో 10.2 మి.మీ వర్షం పడింది. హిందూపురం 8.6 మి.మీ, చిలమత్తూరు 7.2, లేపాక్షి 6.2, మడకశిర 5.0, రొళ్ల 4.2, అమడగూరు 3.8, గుడిబండ 3.4, గోరంట్ల 3.2, అగళి 3.0, సోమందేపల్లి 2.8 మి.మీ మేర వర్షపాతం నమోదైంది.

తుంగభద్రకు భారీగా వరద



బొమ్మనహళ్: తుంగభద్ర జలాశయానికి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది.ఎగువన తుంగ ప్రాజెక్ట్‌కు వరద పోటెత్తింది. దీంతో అక్కడి అధికారులు ప్రాజెక్ట్ గేట్లను ఎత్తి 29 వేల క్యూసెక్కుల నీటిని నదికి వదులుతున్నారు. ఈ నీరంతా టీబీ డ్యాంకు చేరుతోంది. తుంగభద్ర జలాశయం 1,633 అడుగులతో 100.855 టీంఎసీల నిల్వ సామర్థ్యం ఉండగా.. ఆదివారం నాటికి 1,599.87 అడుగులతో 21.356 టీంఎసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 54,657 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 125 క్యూసెక్కులుగా నమోదైంది. ఇన్‌ఫ్లో ఇలాగే కొనసాగితే ఆగస్టు మొదటి వారంలోగా డ్యాం పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉందని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు.

ముగిసిన హెచ్‌ఎంల శిక్షణ



పరిశీలకులు, మాస్టర్ ట్రైనర్లతో హెచ్‌ఎంలు

రాప్తాడురూరల్: 'లీడర్ షిప్' అనే అంశంపై ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆరు రోజులుగా అనంతపురం టీటీడీసీ కేంద్రంలో జరుగుతున్న తొలివిడత శిక్షణ ఆదివారంతో ముగిసింది. అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 184 మంది హెచ్‌ఎంలు పాల్గొన్నారు. సోమవారం నుంచి రెండోవిడత శిక్షణ హెచ్‌ఎంలకు ప్రారంభమవుతుంది. దేశంలోనే విద్యా యాజమాన్య శిక్షణలో ఉత్తమ ఆచరణ పద్ధతులను పాటించే కై వల్య, సత్వ అనే స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో శిక్షణ అందించారు. పాఠశాల విద్య ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ శిక్షణ కేంద్రంలోనే ఉంటూ పర్యవేక్షించారు. విద్యా యాజమాన్య శిక్షణలో అత్యుత్తమ అనుభవం కల్గిన మాస్టర్ ఫెసిలేటర్లు, హెచ్‌ఎంలను శిక్షణలో పూర్తిగా నిమగ్నం చేయించారు. సీమాట్ డైరెక్టర్ మస్తానయ్య రెండురోజుల పాటు ఉండి శిక్షణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తొలివిడత శిక్షణ ముగింపు సందర్భంగా పలువురు హెచ్‌ఎంలు మాట్లాడారు. గతంలో ఇలాంటి శిక్షణ ఎప్పుడూ చూడలేదన్నారు. నిజంగా ప్రధానోపాధ్యాయులందరికీ ఇలాంటి శిక్షణ చాలా అవసరం అన్నారు.

పల్లెవించిన వైద్యం

గ్రామీణ ప్రాంతాల్లో జబ్బు చేస్తే చికిత్స కోసం పట్టణాలకు వెళ్లేవారు. ఇది వ్యయప్రయాసలతో కూడుకున్నది. డబ్బు లేని నిరుపేదలు అంత దూరం వెళ్లలేక జబ్బుతో అలానే బాధపడేవారు. ఇలాంటి వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జగన్ సర్కారు వైద్య సేవలను గ్రామ స్థాయిలోనే అందేలా చర్యలు తీసుకుంది. ప్రతి సచివాలయం పరిధిలో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసింది. గత ఏడాది నుంచి అమలులోకి వచ్చిన ఫ్యామిలీ డాక్టర్' కాన్సెప్ట్ ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వ్యయప్రయాసలు లేకుండా స్థానికంగానే మెరుగైన వైద్యం అందిస్తోంది.



విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైద్యసేవలను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ ఎస్‌వీ కృష్ణారెడ్డి

- తగ్గిన వ్యయప్రయాసలు
- గ్రామీణులకు వరంగా వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు
- ఓపీతో పాటు టెలి మెడిసిన్ ద్వారానూ వైద్య సేవలు
- ప్రతి గ్రామానికీ వెళ్తున్న 'ఫ్యామిలీ డాక్టర్' వైద్య బృందం



సాక్షి పుట్టపర్తి/ అనంతపురం క్రైం: : రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. గ్రామీణ ప్రజలకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా నమ్మకంతో కూడిన వైద్యం అందిస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 812 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. బీఎస్సీ నర్సింగ్ అర్హత ఉన్న మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ)/సీహెచ్‌ఓ, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు అందుబాటులో ఉంటారు. సమగ్ర మాతృ, నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణ సేవలు, పిల్లలు, కౌమార బాల, బాలికల సేవలు, బీపీ, షుగర్, రక్తహీనత, తదితర వైద్యసేవలందిస్తారు. హెచ్‌బీ, ప్రెగ్నెన్సీ, యూరిన్, బ్లడ్ షుగర్, మలేరియా, హెచ్‌ఐవీ, డెంగీ, విజువల్ ఇన్‌ఫెక్షన్ (గర్భసంచి ముఖ ద్వారా కేన్సర్ పరీక్ష), టెస్ట్ ఫర్ అయోడిన్ (థైరాయిడ్ సమస్య రాకుండా) హెపటైటిస్‌బీ, స్ఫుటమ్, సుఖ వ్యాధులు తదితర మొత్తం 14 రకాల పరీక్షలు నిర్వహిస్తారు. వీటితో పాటు దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్, గర్భిణులు, బాలింతలకు అందించే మందులు, వివిధ రకాల యాంటీబయాటిక్స్ తదితర మొత్తం 105 రకాల మందులను అందుబాటులో ఉంచారు.

నిపుణుల ద్వారా టెలీ మెడిసిన్ సేవలు..

థైరాయిడ్, బీపీ, షుగర్, టైఫాయిడ్, డెంగీ జ్వరాలకు, గర్భిణులు, చిన్నారుల సమస్యలకు సంబంధించి టెలీ మెడిసిన్ సేవలు అందుబాటులో ఉన్నాయి. అనంతపురం, కర్నూలు, తిరుపతిలో టెలీ మెడిసిన్ హబ్‌లు ఏర్పాటు చేశారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు, జనరల్ మెడిసిన్ డాక్టర్లు, గైనకాలజిస్టులు అందుబాటులో ఉంటూ టెలీ మెడిసిన్ ద్వారా వివిధ సమస్యలతో బాధపడుతున్న వారికి చికిత్సను అందించేలా ఎంఎల్‌హెచ్‌పీలను ఆదేశిస్తారు. ఉమ్మడి జిల్లాలో నెలకు ఎనిమిది వేల మంది వరకు టెలీమెడిసిన్ సేవలు పొందుతున్నారు.

ఇంటి వద్దకే ఫ్యామిలీ డాక్టర్ సేవలు..

గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు గతేడాది అక్టోబర్‌లో 'ఫ్యామిలీ డాక్టర్' విధానాన్ని ప్రవేశపెట్టింది. ప్రతి పీహెచ్‌సీలో ఉండే ఇద్దరు వైద్యుల్లో ఒకరు ప్రతి గ్రామానికీ 104 వాహనంలో వెళ్లి ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నారు. జిల్లాలో '104 వాహనాలు' 36 అందుబాటులో ఉన్నాయి. ఈ వాహనాలు నెలలో 26 రోజుల పాటు ప్రతి గ్రామానికీ వెళ్తాయి.

వైద్యాధికారి ప్రతి గ్రామాన్నీ రెండుసార్లు సందర్శించి తీవ్రమైన, సాధారణ ఆరోగ్య సమస్యలు, గర్భిణులు, బాలింతలు, మానసిక, డీ అడిక్షన్, కౌన్సెలింగ్, సాంక్రమిక, అసాంక్రమిక వ్యాధుల బాధితులు, ఆరోగ్య శ్రీ కింద శస్త్రచికిత్సలు చేయించుకున్న వారిని పరిశీలించి సేవలందిస్తారు.

చిలమత్తూరు మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది బ్రహ్మేశ్వరం గ్రామం. ఈ పల్లెలో ఎవరికైనా ఆరోగ్యం బాగాలేకపోతే ఆస్పత్రికి వెళ్లడం కష్టంగా ఉండేది. చిలమత్తూరు లేదా 30 కిలోమీటర్ల దూరంలోని హిందూపురం వెళ్లాల్సి వచ్చేది. లేకుంటే సమీపంలో ఉండే ఆర్ఎంపీలను ఆశ్రయించాల్సి వచ్చేది. వర్షాకాలంలో అయితే మరిన్ని ఇబ్బందులు పడాల్సి వచ్చేది. గర్భిణులు లేదా అత్యవసర వైద్యం అందించాల్సిన వారిని ఆస్పత్రికి తీసుకెళ్లడం అంటే మరింత ఇబ్బందిగా ఉండేది. గ్రామంలోనే జగన్ సర్కారు వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడంతో అలాంటి బాధలన్నీ తప్పాయి. చిన్న పిల్లలకు టీకాలు మొదలు గర్భిణులకు వైద్య సేవలు, సీజనల్ వ్యాధులకు చికిత్సలు అందుతున్నాయి.



అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లిలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

శ్రీ సత్యసాయి జిల్లాలో..	
వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	379
చికిత్స పొందిన రోగులు	2,91,174
ఎక్కువగా చికిత్స చేసినది (హైపర్ టెన్షన్ రోగులు)	22,757
డయాబెటిస్ రోగులు	14,393
నెలలో టెలిమెడిసిన్ సేవలు పొందుతున్న వారి సంఖ్య	5 వేల పైమాటే



ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా గ్రామంలో ఇంటి వద్దే వైద్యం అందిస్తున్న దృశ్యం



అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మహిళకు 'టెలీ మెడిసిన్' ద్వారా వైద్య సేవలు



అంగన్‌వాడీ కేంద్రంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యుడు

ఊర్లోనే వైద్య సేవలు



నాకు వయసు మీద పడింది. హైపర్‌టెన్షన్, డయాబెటిక్ సమస్యలు వేధిస్తున్నాయి. గతంలో వ్యయ ప్రయాసలకు ఓర్చి ఇతర ప్రాంతాలకు వెళ్లి వైద్యసేవలు పొందేదాన్ని. అయితే, మా ఊళ్లోనే వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసిన తర్వాత ఆ ఇబ్బందులన్నీ తప్పాయి. స్థానికంగానే క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటున్నా. అవసరమైన మందులను ఉచితంగా పొందుతున్నా. నాతో పాటు చాలామంది వృద్ధులు వైద్య సేవలు పొందుతున్నారు.

– గౌరమ్మ, బ్రహ్మేశ్వరం గ్రామం, చిలమత్తూరు మండలం

నాణ్యమైన వైద్యం



మా గ్రామంలో కొన్ని రోజుల క్రితం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేశారు. అందరికీ వైద్య సేవలు అందిస్తున్నారు. 16 రకాల వైద్య పరీక్షలు చేసి, రిపోర్టులు సైతం వెంటనే అందజేస్తున్నారు. ఇటీవల జ్వరం, ఒళ్లు నొప్పులు వస్తే హెల్త్ క్లినిక్‌కు వెళ్లి పరీక్షలు చేయించుకుని మాత్రలు తీసుకున్నా. గతంలో ఏ చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా పట్టణాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. జగన్ ప్రభుత్వం వచ్చాక ఆ బాధలన్నీ తప్పాయి.

– శాంతమ్మ, పి.కొత్తపల్లి, ఎన్‌పీ కుంట మండలం

ఉత్తమ సేవలు

గతంలో వెయ్యి జనాభాకు ఆశా, ఐదువేల జనాభాకు ఏఎన్‌ఎంలు ఉండేవారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారిని ప్రభుత్వం సీహెచ్‌ఓలుగా నియమించింది. ప్రతి 2,500 మంది జనాభా ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ద్వారా రక్త పరీక్షలు, మందులు, తదితర ఉత్తమ సేవలందిస్తున్నాం. వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పక్కాగా అమలు చేసేందుకు ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ చెన్నకేశవులు, డాక్టర్ సుజాత నిత్యం పర్యవేక్షించేలా చర్యలు తీసుకుని మంచి ఫలితాలు సాధిస్తున్నాం. వివిధ రకాల పరీక్షలు చేయడంతో పాటు ఆహార నియమాలపై సలహాలు ఇస్తున్నాం.

– డాక్టర్ కృష్ణారెడ్డి, డీఎంహెచ్‌ఓ

వడ్డీ బాధలకు ఫుల్‌స్టాప్!

- అక్కచెల్లెమ్మలకు అండగా సీఎం జగన్
- 'వైఎస్సార్ సున్నా వడ్డీ' నగదు విడుదలకు సన్నద్ధం
- జిల్లాలో 3,91,830 మందికి రూ.52.38 కోట్ల లబ్ధి
- 26న డ్వాక్రా మహిళల ఖాతాల్లో జమ



డ్వాక్రా సంఘం ద్వారా రుణం తీసుకుని బజ్జీల దుకాణం ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారు

పుట్టపర్తి అర్బన్: మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అక్కచెల్లెమ్మల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోంది. ఈ క్రమంలోనే వరుసగా నాలుగో ఏడాది 'వైఎస్సార్ సున్నా వడ్డీ' అమలుకు చర్యలు తీసుకుంది. గత ప్రభుత్వాల నిర్వాకంతో దివాళా తీసిన మహిళా సంఘాలు వైఎస్సార్ సీపీ సర్కారు చేయూతతో బలోపేతం అవుతున్నాయి. డ్వాక్రా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 35,963 స్వయం సంఘాల్లో లబ్ధిదారులైన 3,91,830 మంది ఖాతాల్లో ఈ నెల 26న రూ.52.38 కోట్లు నగదు జమ కానుంది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జరిగే కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్ కంప్యూటర్ బటన్ నొక్కి నిధులు విడుదల చేస్తారు.

చిరు వ్యాపారాలకు కొండంత అండ..

ఎన్నికల ముందు చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రలో మహిళల కష్టాలను వైఎస్ జగన్ కళ్లారా చూశారు. అధికారంలోకి రాగానే వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ పథకాలకు శ్రీకారం చుట్టారు. 2019లో వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమాన్ని ప్రారంభించి అప్పటి నుంచి క్రమం తప్పకుండా అందజేస్తూ వస్తున్నారు. సకాలంలో వాయిదాలు చెల్లించిన అన్ని సంఘాలకు సున్నా వడ్డీ వర్తింపజేస్తున్నారు. నేరుగా స్వయం సహాయక సంఘాల అప్పు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఒక వేళ అప్పు ఖాతా మూసి వేసి ఉంటే పొదుపు ఖాతాలకు జమ చేస్తారు. చిన్న తరహా వ్యాపారులు తమ కార్యకలాపాలను మరింత లాభదాయకంగా నడపడానికి, మెరుగైన జీవనం సాగించడానికి పథకం ఎంతగానో ఉపయోగపడుతోంది.

సంవత్సరం	సంఘాలు	మహిళలు	లబ్ధి (రూ. కోట్లలో)
2020–21	30,301	3,21,488	51.22
2021–22	36,633	3,85,813	60.94
2022–23	35,963	3,91,830	52.38

ఈ ఏడాది 'వైఎస్సార్ సున్నా వడ్డీ' లబ్ధిదారుల వివరాలు	
మండలాలు	32
లబ్ధిదారులు	3,24,242
అందనున్న నగదు	రూ.40.25 కోట్లు
అర్బన్ ప్రాంతాలు	6
లబ్ధిదారులు	67,588
అందనున్న నగదు	రూ.12.13 కోట్లు

చిరు వ్యాపారులకు చేయూత



చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే మా లాంటి మహిళలకు సున్నా వడ్డీ నగదు ఎంతగానో ఉపయోగపడుతుంది. డ్వాక్రా రుణాలను పూర్తిగా మాఫీ చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుంది. నాలుగు విడతల్లో పూర్తి మొత్తం చేతికి వచ్చింది. దీంతో పాటు సక్రమంగా కంతులు కట్టే వారికి వైఎస్సార్ సున్నా వడ్డీ క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి ముఖ్యమంత్రిని చూడలేదు.

– రహమత్‌బీ, పెడపల్లి

చాలా మంచి పథకం



వైఎస్సార్ సున్నా వడ్డీ చాలా మంచి పథకం. బ్యాంకు నుంచి తీసుకున్న రుణానికి అధికారులు చెప్పిన ప్రకారం కంతులు చెల్లిస్తున్నాం. ప్రతి సారీ వడ్డీ మొత్తాన్ని ఖాతాలకు జమ చేస్తున్నారు. డ్వాక్రా రుణాలతో చిల్లర దుకాణం ఏర్పాటు చేసుకున్నా. ప్రభుత్వం అందజేస్తున్న సున్నావడ్డీ నగదుతో వ్యాపారాలను బలోపేతం చేసుకుంటున్నాం. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– పుష్పావతి, బీసీ కాలనీ

26న నిధుల జమ



సీఎం వైఎస్ జగన్ ఈ నెల 26న 'వైఎస్సార్ సున్నా వడ్డీ' పథకం కింద నగదును విడుదల చేస్తారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురంలో ఈ కార్యక్రమం ఉంటుంది. ముఖ్యమంత్రి నిధులు జమ చేయగానే కలెక్టరేట్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తారు.

– నరసయ్య, డీఆర్‌డీఏ, పీడీ

1,300 ఇంజినీరింగ్ సీట్లు కోత

- 13 ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు లేక దుస్థితి
- మూడు ఇంజినీరింగ్ కళాశాలలకు షోకాజ్
- నేటి నుంచి ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏఐసీటీఈ అనుమతించిన సీట్లలో మొత్తం 1,300 సీట్లను వర్సిటీ కోత విధించింది. విద్యా ప్రమాణాలు లోపించడం, మౌలిక సదుపాయాల లేమి, అనర్హులైన, అనుభవం లేని ప్రొఫెసర్లతో బోధన, పరిశోధనలు లేకపోవడం, ఏఐసీటీఈ నిబంధనలు పాటించకపోవడం, గత మూడు సంవత్సరాల్లో అనుమతించిన సీట్ల కంటే 30 శాతంలోపు ఇంజినీరింగ్ సీట్లు భర్తీ చేయడం తదితర కారణాలతో ఈ దురవస్థ నెలకొంది. 13 ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆ మేరకు సీట్ల కోత విధించారు. ఇందులో ఎక్కువ కంప్యూటర్ సైన్సెస్ సీట్లు కావడం గమనార్హం. మరో వైపు మూడు ఇంజినీరింగ్ కళాశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వచ్చే విద్యా సంవత్సరంలోపు సరైన సదుపాయాలు కల్పించకపోతే అడ్మిషన్లు నిరాకరిస్తామని పేర్కొన్నారు.

నేటి నుంచి ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ..

ఏపీ ఈఏపీసెట్ –2023కు సంబంధించిన కౌన్సెలింగ్ షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 24 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహిస్తారు. హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ఈ నెల 25 నుంచి ఆగస్టు 4వ వరకూ అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తారు. ఆగస్టు 3 నుంచి 8 వరకూ వెబ్ ఆప్షన్ల ఎంపిక, 9వ తేదీ వెబ్ ఆప్షన్ల మార్పు, ఆగస్టు 12న సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఆగస్టు 13 నుంచి 14 వరకూ సెల్ఫ్ రిపోర్టింగ్, లేదా నేరుగా కళాశాలకు వెళ్లి రిపోర్ట్ చేయడం, ఆగస్టు 16 నుంచి ఇంజినీరింగ్, ఫార్మసీ తరగతులు నిర్వహిస్తారు.ఏపీ ఈఏపీసెట్ –2023 కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఎన్ని సీట్లు ఖరారు చేశారనే అంశంపై స్పష్టత వచ్చింది. ఏపీ ఉన్నత విద్యామండలికి జేఎన్‌టీయూ అనంతపురం ఉన్నతాధికారులు అనుమతించిన ఇంజినీరింగ్, ఫార్మసీ సీట్లను నివేదించారు. తద్వారా ఉన్నత విద్యామండలి అనుమతించిన సీట్లకే వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి వీలు కలుగుతుంది.

వైభవంగా గూగూడు బ్రహ్మోత్సవాలు



గూగూడులో కొలువైన కుళ్లాయిస్వామి



అగ్ని గుండం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున అర్చకుడు హుసేనప్ప స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భక్తుల రద్దీని నియంత్రించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ శివశంకర్ రెడ్డి, ఈఓ శోభ, కో ఆప్షన్ మెంబర్ షాబీరా, ఎంపీటీసీ సభ్యుడు రాజారెడ్డి, నాయకులు గోపాల్, శివయ్య, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రమాదంలో ఏఎస్‌ఐకు గాయాలు


గాయపడిన ఆదినారాయణ

హిందూపురం అర్బన్: మండల పరిధిలోని నందమూరి నగర్ వద్ద ఆదివారం చోటు చేసుకున్న ప్రమాదంలో ఏఎస్‌ఐ ఆదినారాయణ గాయపడ్డారు. హిందూపురం నుంచి ఇటీవలే కదిరికి బదిలీ అయిన ఆయన ద్విచక్ర వాహనంలో వెళ్లి విధులు నిర్వర్తించి వచ్చేవారు. ఈ క్రమంలో ఆదివారం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై హిందూపురానికి వస్తుండగా నందమూరినగర్ వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక అదుపు తప్పి కిందపడ్డాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు వెంటనే హిందూపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

యువకుడి దుర్మరణం


వెంగమునిరెడ్డి (ఫైల్)

ముదిగుబ్బ: ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... ముదిగుబ్బ మండలం ఈదులపల్లికి చెందిన వెంగమునిరెడ్డి (35) ఆదివారం ఉదయం వ్యక్తిగత పనిపై ముదిగుబ్బకు వచ్చాడు. పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన ఆయన మర్తాడు వద్దకు చేరుకోగానే వేరుశనగ నూర్పిడి యంత్రాన్ని కట్టుకుని వెళుతున్న ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేస్తున్న క్రమంలో అదుపు తప్పి ట్రాక్టర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సరళ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తండ్రీకొడుకు బలవన్మరణం



రామమూర్తి, సాయికుమార్ (ఫైల్)

వజ్రకరూరు: వ్యాపారంలో నష్టం రావడంతో మనస్తాపం చెందిన తండ్రీకొడుకులు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు... బెళుగుప్పకు చెందిన ఎం.రామమూర్తి(66), ఆయన కుమారుడు ఎం.సాయికుమార్ కొన్నేళ్లుగా శనగల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నారు. వ్యాపారంలో దాదాపు రూ.2 కోట్ల మేర నష్టాలను చవిచూడాల్సి రావడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై వారు ఆదివారం రాత్రి వజ్రకరూరు మండలం గంజికుంట వద్దకు చేరుకుని పురుగుల మందు తాగారు. ఈ విషయం తెలుసుకున్న రెండో కుమారుడు హరిచరణ్ వెంటనే పోలీసులను అప్రమత్తం చేస్తూ తన తండ్రి వాడుతున్న ఫోన్ నంబర్‌ను తెలిపాడు. ఆ ఫోన్ నంబర్ లోకేషన్ ఆధారంగా పోలీసులు ఆగమేఘాలపై అక్కడకు చేరుకుని పరిశీలించారు. అప్పటికే తండ్రీకొడుకు మృతి చెందారు. మృతదేహాలను ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హరిచరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మూడో పంట కళకళ


పెనుకొండ మండలం వెంకటరెడ్డిపల్లి వద్ద సాగైన పొద్దుతిరుగుడు పంట


గోరంట్ల మండలం గంగంపల్లి వద్ద సాగైన వేరుశనగ


దిగువచెర్లోపల్లి వద్ద సాగులో ఉన్న సంకరజాతి సజ్జ


కప్పలబండ వద్ద కళకళలాడుతున్న వేరుశనగ పంట

'ఏనుగట్లా రైతు ఎగబడి సేద్యంజేసి ఎండే పంటల్జూసి పీనిగై పాయ!!'

... అంటూ ఒకప్పుడు హిందూపురానికి చెందిన కవి సడ్లపల్లి చిదంబరరెడ్డి కలం నుంచి జాలువారిన ఈ పదాలు నాడు జిల్లా దుర్భిక్షానికి అద్దం పట్టాయి. అయితే నేడు ఈ పరిస్థితి లేదు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతు సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యత నివ్వడంతో వ్యవసాయం పండుగలా సాగుతోంది. దీనికి తోడు ప్రకృతి కరుణించడంతో 2019 తర్వాత నుంచి వర్షాలు సమృద్ధిగా కురిశాయి. ఫలితంగా భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా పలువురు రైతులు ఖరీఫ్, రబీ పంటలు చేతికందగానే బోరుబావుల కింద మూడో పంట సాగు చేపట్టారు. 10వేలకు పైగా ఎకరాల్లో సాగు చేసిన పొద్దుతిరుగుడు పంట చేతికొచ్చింది. ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. అలాగే 5 వేల ఎకరాలకు పైగా సాగు చేసిన సజ్జ పంటలో ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్లు, 12వేల హెక్టార్లకు పైగా సాగులో ఉన్న మొక్కజొన్నలో ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ పంటలు చేతికి అందగానే వేరుశనగ విత్తు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

– పుట్టపర్తి అర్బన్:

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి


ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న జిల్లా అపుస్మా నాయకులు

- ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

హిందూపురం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా హిందూపురానికి వచ్చిన ఆయన బాలయేసు కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించారు. జగన్ సర్కార్ ప్రవేశపెట్టిన అమ్మ ఒడి, నాడు నేడు, విద్యా కానుక తదితర పథకాలు దేశంలోని మిగిలిన రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచాయన్నారు. రేపటి భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేస్తున్న కృషికి సహకారం అందించాలని ఉపాధ్యాయులను కోరారు. పెండింగ్‌లో ఉపాధ్యాయుల సమస్యలనూ ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. 2008, 2019 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులకు అన్ని విధాల న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరాజు, గోపాల్, సల్మాన్‌రాజ్, పీఆర్‌టీయూ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, పుల్లారెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ అశోక్‌కుమార్‌రెడ్డి, స్థానిక నాయకులు చెన్నారెడ్డి, నాగరాజు, ఈశ్వరరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కరానికి కృషి

ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కరానికి తానెప్పుడూ ముందుంటానని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అన్నారు. జిల్లాకు విచ్చేసిన ఆయనను స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో ఆ శాఖ జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ... ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అపుస్మా నాయకులు పంచజన్య శ్రీనివాసులు, వేణుగోపాల్, రియాజ్, మధు, గౌస్, అనంతపురం జిల్లా నాయకులు పుల్లారెడ్డి, రామిరెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు రూరల్: మాజీ మంత్రి పరిటాల సునీత కుటుంబానికి సొంత మండలంలోనే టీడీపీ కార్యకర్తలు షాక్ ఇచ్చారు. 40 ఏళ్లుగా టీడీపీలో కొనసాగిన వాళ్లు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఆదివారం అనంతపురంలోని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో వారంతా పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో రామగిరి మండలం శేషంపల్లి టీడీపీ నాయకులు ఉప్పర శివ లింగమయ్య, ఉప్పర శివయ్య, ఉప్పర రామాంజినేయులు, ఉప్పర నాగేంద్ర తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ ఫలాల ప్రజల దరికి చేర్చడంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చూపిన చొరవను కొనియాడారు. 30 ఏళ్లకు పైగా అధికారంలో ఉన్న పరిటాల కుటుంబం చేయలేని అభివృద్ధిని కేవలం నాలుగేళ్లలోనే ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సాధించారన్నారు. దీంతో తామంతా స్వచ్ఛందంగా టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రామగిరి మండల కన్వీనర్ రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు గోసే నాగార్జున, సర్పంచ్ నరేంద్ర, శేషంపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్


జూదరులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అమరాపురం: మండలంలోని వి.అగ్రహారం శివారులో పేకాట (మంగపత్త) ఆడుతున్న 16 మందిని అరెస్ట్ చేసినట్లు మడకశిర సీఐ.సురేష్‌బాబు తెలిపారు. అందిన ముందస్తు సమాచారంతో ఎస్‌ఐ బీటీ వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఐ.రామాంజనేయులు, సిబ్బంది ఆదివారం ఉదయం వి.అగ్రహారం గ్రామానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో మంగపత్తా ఆడుతూ 16 మంది పట్టుబడ్డారు. వారి నుంచి రూ.1,60,150 నగదుతో పాటు 9 ద్విచక్రవాహనాలు, 13 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో జిల్లా వాసులతో పాటు కర్ణాటక వాసులూ ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పరీక్ష కేంద్రం మార్పు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం యూజీ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 26న ప్రారంభమై సెప్టెంబర్ 8న ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలను పరీక్ష కేంద్రంగా కేటాయించిన విద్యార్థులను ఎస్కేయూ క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కళాశాలకు బదలాయించారు. దీంతో ఆర్ట్స్ కళాశాలలో పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థి ఈ మార్పును గమనించాలని ఎస్కేయూ యాజమాన్యం కోరింది. మిగిలిన అన్ని పరీక్ష కేంద్రాల్లో యథావిధిగా పరీక్షలు జరుగుతాయి.

26న జిల్లా స్థాయి రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపిక

హిందూపురం: స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాల వేదికగా ఈ నెల 26న జిల్లా స్థాయి రెజ్లింగ్ గ్రాప్లర్ల ఎంపికలు చేపట్టారు. ఈ మేరకు జిల్లా రెజ్లింగ్ సంఘం ప్రెసిడెంట్ కె.రమేష్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అండర్ 11, 13, 15 బాలబాలికల సబ్‌జూనియర్ విభాగంలో ఎంపికలు ఉంటాయి. రెజ్లింగ్‌లోని గ్రాప్లింగ్ స్టైల్ జీఐ, నోగీ విభాగంలో బాలబాలికలకు విడివిడిగా పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఎంపికైన క్రీడాకారులు అనకాపల్లిలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో పాటు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలు తీసుకెళ్లాలి. పూర్తి వివరాలకు 82470 75747, 98499 25868, 91332 67371లో సంప్రదించవచ్చు.

కొనసాగుతున్న ఆర్డీటీ క్రికెట్ టోర్నీ


అనంతపురం: ఆర్డీటీ స్టాఫ్ క్రికెట్ టోర్నమెంట్ తొలి రౌండ్ పోటీలు ఆదివారం ముగిసాయి. స్పైక్ రైడర్స్, కళ్యాణదుర్గం హాస్పిటల్, బుక్కరాయసముద్రం, బత్తలపల్లి రీజియన్ కేంద్రాల జట్లు విజయం సాధించాయి. ఉత్తమ క్రీడాకారులకు బహుమతులు అందజేసి, అభినందించారు. ఈ క్రమంలోనే రెండో రౌండ్ పోటీలను బుక్కరాయసముద్రం రీజనల్ డైరెక్టర్ నారాయణారెడ్డి, శ్రీశైలం రీజనల్ డైరెక్టర్ పుష్ప, టోర్నీ ఆర్గనైజర్లు బీవై నాగప్ప, పి. గంగప్ప, జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి మధు ఆచారి, కోచ్‌లు ఆర్.కుమార్, ప్రవీణ్ ప్రారంభించారు.

బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా భూపతి


భూపతి శివకుమార్‌శర్మను అభినందిస్తున్న సంఘం నాయకులు

ముదిగుబ్బ: జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా భూపతి కుమార్ శర్మ నియమితులయ్యారు. ఆదివారం కర్నూలులో జరిగిన రాష్ట్ర సంఘం సమావేశానికి ఏపీ దేవాదాయ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఆపన్న ప్రదీప్న బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య (ఏపీబీఎస్ఎస్ఎస్) జిల్లా అధ్యక్షుడిగా భూపతి శివకుమార్ శర్మ(కొడవండ్లపల్లి)ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఆయనను అభినందించారు.

తిలక్‌కు 'చిత్రా'ంజలి


కాఫీ పొడర్‌తో శ్రీరాములు గీసిన బాలగంగాధర్ తిలక్ చిత్రం

రామగిరి: జాతీయ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన బాలగంగాధర్ తిలక్‌కు రామగిరి మండలం పేరూరు డ్యాంలోని ఏపీఆర్ఎస్ పాఠశాల డ్రాయింగ్ టీచర్ శ్రీరాములు వినూత్నంగా నివాళులర్పించారు. తిలక్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 23న ఆయన చిత్రాన్ని కాఫీ పొడర్‌తో అద్భుతంగా చిత్రీకరించి, అందరి మన్ననలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన మహోన్నతి వ్యక్తి బాలగంగాధర్ తిలక్ అన్నారు.

వేటకు వెళ్లి మృత్యువాత


కిరణ్ (ఫైల్)

నల్లమాడ: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బుక్కపట్నం మండలం అగ్రహారం గ్రామానికి చెందిన కసం సావిత్రమ్మ, కిష్టప్ప దంపతుల పెద్ద కుమారుడు కసం కిరణ్ (26)కు భార్య లక్ష్మి, ఐదేళ్లలోపు కుమారుడు ఉన్నారు. భార్య ప్రస్తుతం గర్భిణి. వ్యవసాయ పనులతో జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన మరికొందరితో కలసి శనివారం రాత్రి నల్లమాడ మండలం కొత్తపల్లి తండా అటవీ ప్రాంతంలో కుందేళ్ల వేటకు వెళ్లాడు. రాత్రి 10 గంటలకు బీడు భూమిలో నడుచుకుంటూ వెళుతుండగా అప్పటికే గుర్తు తెలియని వ్యక్తులు వన్యప్రాణులను వేటాడేందుకు అమర్చిన విద్యుత్ వైరు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో పాటు ఉన్న వ్యక్తులు సెల్‌ఫోన్ ద్వారా మృతుని తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని కుమారుడి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. ఘటనపై ఎస్‌ఐ వలీబాషా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మైమరపించిన యక్షగానం


సంగీత కచేరి నిర్వహిస్తున్న సత్యసాయి యూత్ సభ్యులు


యక్షగానంలో ఓ సన్నివేశం

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి చేరుకున్న ఉత్తర కర్ణాటక సత్యసాయి భక్తులు రెండో రోజు ఆదివారం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ఉదయం 'దివ్యగానామృతం' పేరుతో సత్యసాయి సన్నిధిలో సంగీత కచేరి నిర్వహించారు. సత్యసాయి వైభవాన్ని చాటుతూ గానం చేశారు. సాయంత్రం ఉత్తర కర్ణాటకలోని చొక్కడి బాలవికాస్ విద్యార్థులు యక్షగానంతో మైమరిపించారు. అనంతరం కళాకారులను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

ముత్యాలమ్మ ఆలయంలో చోరీకి యత్నం

- హుండీ బద్దలుగొట్టిన దుండగులు
- సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు

రామగిరి: మండలంలో ప్రసిద్ధిగాంచిన నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో చోరీకి విఫలయత్నం జరిగింది. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి విఫలయత్నం చేసినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ జనార్దననాయుడు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. ఆలయంలోకి చొరబడిన దుండగులు హుండీని బద్దలుగొట్టారన్నారు. అయితే గురువారం హుండీ కానుకలు లెక్కించడంతో అందులో కేవలం కొద్దిపాటి చిల్లర మాత్రమే ఉందన్నారు. సీసీ ఫుటేజీల ఆధారంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కొన్నేళ్లుగా ఓ కుటుంబం కబంద హస్తాల్లో ఉన్న ఈ ఆలయాన్ని దేవదాయ శాఖ పరిధిలోకి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేర్చిందని ఆలయ చైర్మన్ కురుబ ముత్యాలప్ప గుర్తు చేశారు. అయితే ఈ విషయం గిట్టని వారు ఎలాగైనా ఆలయాన్ని దక్కించుకునేందుకు ఇలాంటి చవకబారు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. అమ్మవారి ఆశీస్సులతో కుట్రలను తిప్పి కొడతామన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు చేశారు. కర్ణాటక, ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

అపూర్వ సమ్మేళనం


సమావేశమైన పూర్వ విద్యార్థులు

ప్రశాంతి నిలయం: వారందరూ ఒకే చోట చదివారు. వివిధ వ్యాపకాలతో ముందుకు సాగుతూ వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఈ క్రమంలో వారికి బాల్యం గుర్తొచ్చింది. తమ బాల్య స్నేహితులను కలుసుకోవాలని అనుకున్నారు. అనుకున్నదే తడవుగా అందరినీ ఏక తాటిపైకి తీసుకువచ్చి సంబరం చేసుకున్నారు. ఇందుకు కొత్తచెరువు మండలం తలమర్లలోని జెడ్పీ ఉన్నత పాఠశాల వేదికైంది. 1996–97 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. కుటుంబసభ్యులతో పాటు పూర్వ విద్యార్థులు తరలి వచ్చారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులను సత్కరించి, ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, సదాశివరెడ్డి, రామచంద్రారెడ్డి, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.